క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నీలమణిదుర్గ ఆలయ వార్షికోత్సవం



కుంకుమ పూజలు చేస్తున్న గ్రామస్తులు

టెక్కలి: మండలంలోని చల్లపేటలో నీలమణి దుర్గ ఆలయ వార్షికోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్పంచ్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితుడు సురేష్‌శర్మ నేతృత్వంలో గ్రామస్తులంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పనులు చేస్తున్న సిబ్బంది

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీలోని మెయిన్ రోడ్డు, కరణాల వీధి, రైతుబజార్ వీధుల్లో ఈఓ చింతాడ సన్యాసి ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా తాగునీటి బావులు, వాటర్‌ట్యాంకుల్లో బ్లీచింగ్, క్లోరినేషన్ కార్యక్రమాలు చేపడుతున్నారు.

అంబులెన్సు సేవలపై ఆరా



రికార్డులు పరిశీలిస్తున్న జగన్నాథరావు

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలోని 108 అంబులెన్సు సేవలను డివిజన్ ఆపరేషనల్ అధికారి గుండేపల్లి జగన్నాథరావు శనివారం పరిశీలించారు. వాహన నిర్వహణ, పరికరాల పనితీరు, మందుల నిల్వలు, డ్యూటీ చార్టులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎ.మోహన్‌రావు, ఎం.రామచంద్రరావు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి ప్రవేశపరీక్ష



రాజపురం మోడల్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

కవిటి : మండలంలోని రాజపురం ఏపీ మోడల్ స్కూల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి గానూ మిగులు సీట్ల భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు విశేష స్పందన లభించింది. 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి 102 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారం రోజుల్లో ఫలితాలు వెల్లడిస్తామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోడెం ఈశ్వరరావు తెలిపారు. రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ పంచాయతీలోని ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు శనివారం సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ సూరాడ దాసురాజు చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాసురాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజీవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బారువ కొత్తూరులో వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

సోంపేట: మండలంలోని బారువ మేజర్ పంచాయతీ బారువ కొత్తూరు గ్రామంలో సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 275 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 25 మందిని మెరుగైన వైద్యం కోసం జెమ్స్‌కు రిఫర్ చేశారు. డాక్టర్ పృథ్వీరాజ్, వీక్షిత, గాయత్రి, సహకార సంఘ నాయకులు అమర లోకనాథం పాల్గొన్నారు.

సాగునీరు అందేనా?

- పూడికలు, ఆక్రమణలతో కుచించుకుపోయిన వంశధార కాలువ
- ఆందోళనలో అన్నదాతలు



మర్లపాడు వద్ద సాగునీటి కాలువ దుస్థితి

వజ్రపుకొత్తూరు: పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు భూములకు సాగునీరు అందించే ప్రధాన వనరు వంశధార కాలువ అధ్వానంగా మారింది. తక్షణ మరమ్మతులు, పూడిక తీసే పనులు, మదుములు నిర్మించకపోతే ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన కాలువలపై ఉన్న ఎత్తిపోతల పథకాలు నిలిపివేసి, కాలువలు ఆధునీకరించి శివారు భూములకు నారు చేరాకే ఎత్తిపోతలకు అవకాశం కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని దేశబట్టి, బెండి చానెల్స్ ఆయకట్టు 5670 ఎకరాలు కాగా, పలాస మండలంలో 3200ఎకరాలకు ఎడమ ప్రధాన కాలువ ద్వారా సాగు నీరు అందాల్సి ఉంది. వజ్రపుకొత్తూరు మండలంలో శివారు భూములు ఉండటం వల్ల ప్రత్యేక దృష్టి సారిస్తేనే ఆయా భూములకు సాగునీరు చేరుతుంది.

ఆధునీకరణ తప్పనిసరి..

టెక్కలిలోని మదనగోపాల సాగరం నుంచి పలాస వరకు ఉన్న వంశధార ప్రధాన ఎడమ కాలువను



పాతటెక్కలి వద్ద పొదలతో నిండిన వంశధార కాలువ



పీవీపురం వద్ద కాలువపై శిథిలమైన మదుము

ఆధునీకరించాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా వజ్రపుకొత్తూరు మండలానికి సాగునీరు అందించాలంటే కణితివూరు వద్ద నుంచి 25 కి.మీ. మేర విస్తరించి ఉన్న 60 ఆర్‌ఎల్ 9 టీఈ కాలువ ఆధునీకరణ పనులు జరగాలి. గోవిందపురం పంచాయతీ సీతంపేట నుంచి పాతటెక్కలి మీదుగా దేవునల్తాడ వరకు ఉన్న పిల్ల కాలువ పనులు సైతం చేపట్టాలి. ఈ కాలువ నిండా పొదలు, పూడిక పేరుకుపోయి నీరు జోరుగా శివారు ప్రాంతాలకు వెళ్లని పరిస్థితి ఉంది. మరోవైపు కొండవూరు చిన్నమురహరిపురం, ఉద్దానం కూర్మనాథపురం కొల్లిపాడు ప్రాంతాల్లో కాలువలో ఇసుక మేటలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. వాటిని తొలగించే పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆక్రమణలతో ఆందోళన..

- ఉద్దానం మెళియాపుట్టి వద్ద ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కాలువ గట్టును తవ్వేసి పొలంలో కలుపుకోవడంతో కాలువ బలహీనమైంది.
- చిన్నమురహరిపురం, కొండవూరు తేరపల్లి మధ్య కాలువలో ఇసుక మేటలు వేయడం, కొందరి స్వార్థపూర్వకంగా కాలువను ఆక్రమించుకున్నారు. దీంతో ఇసుక మేటలు తొలగించే పనులకు ఇబ్బంది కలుగుతోంది.
- పి.వి.పురం వద్ద 60 ఆర్‌ఎల్ 5ఎల్ కాలువ ఎగువ గట్టు ఆక్రమించుకుని కాలువలో మట్టిపోయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

న్యాయం చేయాలి..



శివారు భూములకు సాగు నీరు అందాలంటే ముందుగా ప్రధాన కాలువలపై ఉన్న ఎత్తిపోతల పథకాలు ఆపాలి. శివారుకు సాగు నీరు చేరి దమ్ములకు ఇబ్బంది లేనప్పుడే ఎత్తిపోతల పథకాలకు నీరు అందిస్తే బాగుంటుంది. ఇలా చేయకపోవడంతో ఏటా తీవ్రంగా నష్టపోతున్నాం. వర్షాధారంపైనే ఆధార పడుతున్నాం. ఇప్పటికైనా కాలువ ఆధునీకరణ పనులు చేపట్టి సాగునీరు శివారు ప్రాంతాలకు నీరు అందించాలి.

– సీహెచ్ ధర్మారావు, రైతు, కొల్లిపాడు

ఇసుక మేటలు తొలగించాలి..



వంశధార శివార ప్రాంతమైన మా భూములకు ఎప్పుడూ సాగు నీరు అందడం లేదు. నీటి తీరువా వసూళ్లు మాత్రం చేపడుతున్నారు. ఇదెక్కడి న్యాయం? మదుములు, కేటగిరి–1 పనులు పూర్తిగా పాడయ్యాయి. కాలువ గట్లుపై నుంచి పొలాలకు వెళ్లలేని పరిస్థితి. కాలువలో చీపురుగడ్డి, ముళ్ల పొదలు, పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోయి ఇసుక మేటలు ఉన్నాయి. ముందుగా వాటిని తొలగించాలి.

– డి.దానయ్య, రైతు

అన్నదాతకు అండగా ప్రభుత్వం



ప్రగడపుట్టుగలో విత్తనాల పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: అన్నదాతకు అన్నివేళలా వెన్నుదన్నుగా నిలవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శనివారం ప్రగడపుట్టుగ ఆర్బీకే వద్ద రాయితీపై అందిస్తున్న వరివిత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ అధికారులు బీలప్రాంత రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారని చెప్పారు. ఇండింట్ ప్రకారం రైతులకు వరివిత్తనాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిస్తే మంచి దిగుబడులు సాధించేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అంతకుముందు వ్యవసాయశాఖ అధికారులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో సోంపేట సబ్ డివిజన్ ఏడీఓ కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారులు బొర్ర నరసింహమూర్తి(సోంపేట), తిలక్(కవిటి), ధనుంజయ్(కంచిలి), భార్గవి(ఇచ్ఛాపురం), సచివాలయ వ్యవసాయశాఖ సిబ్బంది, వ్యవసాయ విస్తరణాధికారులు, మాజీ జెడ్పీటీసీ బెందాళం రమేష్, సీపాన వెంకటరమణ, మణిచంద్ర ప్రకాష్, సంతోష్ పట్నాయక్, ఆరంగి రాజు, బెందాళం తిరుమలరావు, పండి దేవేంద్రమూర్తి, ఆరంగి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

జీడిపిక్కలకు రూ.16 వేలు మద్దతు ధర చెల్లించాలి



పలాస ఎమ్మెల్యే శిరీషను కలిసిన జీడి రైతాంగ కమిటీ ప్రతినిధులు

పలాస: ఉద్దాన ప్రాంత రైతుల జీవనాధారమైన జీడి పంటకు కనీస మద్దతు ధరను బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతాంగ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పలాస మండలం శాసనాం గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిశారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎ.పి. జీడి రైతాంత సమస్యల సాధన కమిటీ కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, కుత్తుం వినోద్, కొండప్ప సురేఖ, కోనేరు సురేష్, అంబటి రామక్రిష్ణ, యంపల్లి జోగారావు, మద్దిల రామారావు, కోనేరు ఆదినారాయణ, పుచ్చ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు..

వజ్రపుకొత్తూరు రూరల్: పలాస నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన గౌతు శిరీషను పార్టీ కార్యాలయంలో శనివారం వజ్రపుకొత్తూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు లక్కోజి ధర్మారావు, కార్యదర్శి కంచుమోజు కేశవరావు, సంఘ సభ్యులు అరసవల్లి ఉమామహేశ్వరరావు, జగ్గారావు, చింతాడ ప్రసాద్, ఉమా, అప్పారావు, షణ్ముఖరావు, ఆర్‌టీ భుజంగరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: ఎమ్మెల్యే శిరీషను వజ్రపుకొత్తూరు, బెండి, నువ్వలరేవు, పెద్దబొడ్డపాడు తదితర గ్రామ సచివాలయాల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు.

పలాస ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ



ఎమ్మెల్యే శిరీషకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీషను కాశీబుగ్గ పోలీసు డివిజన్ అధికారి నాగేశ్వర రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలాసలోని ఆమె నివాసం వద్ద పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

కాశీబుగ్గ: పలాస మండలం శాసనాం గ్రామంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన బీజేపీ నాయకులు లక్కోజు ధర్మారావు కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇప్పిలి వెంకటరావు, రాజు, శేఖర్, అప్పారావు, హరికృష్ణ, అన్నారావు, లక్ష్మయ్య, షణ్ముఖరావు పాల్గొన్నారు.

‘మెప్మా’ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా కార్యాలయంలో శనివారం అధికారులు, ఆర్పీలతో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంట పట్టణాలలోని అన్ని సంఘాలకు అందించిన సేవలు అభినందనీయమని ప్రశంసించారు. 2023–24 సంవత్సరానికి గాను రుణాల మంజూరు, రికవరీలో లక్ష్యాలు సాధించారని, ఇదే దృక్పథంతో పనిచేయాలన్నారు. సమావేశంలో మెప్మా ఐ.బి.రాము, బి.ఎల్.వెంకటరావు, జిల్లా జీవనోపాధి స్పెషలిస్ట్ బోర భాస్కరరావు, సిటీ మిషన్ మేనేజర్ పిన్నింటి మోహనరెడ్డి, డీఈఓ బోర విజయకుమార్‌రెడ్డి, సీఓ స్వప్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఘన వ్యర్థాల నిర్వహణ



మాట్లాడుతున్న పలాస మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ నాయుడు

కాశీబుగ్గ: ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలాస మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎస్.వి.ఎస్.ఎస్.నాయుడు అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పలాస బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం న్యాయవాదులు, మున్సిపల్, శానిటేషన్ సిబ్బందితో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘన వ్యర్థాలను సరైన పద్ధతిలో ఉపయోగించుకోకపోవడం వల్ల పర్యావరణం కలుషితమై వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితి మారాలన్నారు. సీనియర్ న్యాయవాది బి.కె.ఆర్.పట్నాయక్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు ఎల్.చంద్రశేఖర్, బెండి కాళిదాస్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజ్, వైస్ ప్రెసిడెంట్ ఫయాద్ అహ్మద్, కొమర దేవరాజు, బమ్మిడి కృష్ణారావు, శ్యామ్, నాగు, రవి, ఆర్‌ఐ నిరంజన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ప్రైవేటు స్కూళ్ల నిర్వహణ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ అప్పారావు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలలను నిర్వహించాలని ఎంఈఓ కె.అప్పారావు యాజమాన్యాలకు సూచించారు. ఇచ్ఛాపురం పట్టణంలోని స్వర్ణ భారతి, రవీంద్రభారతి, హెబ్రోన్ పాఠశాలలను శనివారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. కొత్తగా చేరే ప్రతి విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో విధిగా నమోదుచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

లోకనాథం కుటుంబానికి రూ.5 లక్షలు సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామానికి చెందిన తామాడ లోకనాథం ఇటీవల కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తల్లిదండ్రులు చిరంజీవులు, నారాయణమ్మ దంపతులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మద్దిలి నాగేశ్వరరావు, జుత్తు పురుషోత్తం పాల్గొన్నారు.

సోంపేట: కువైట్‌లో మృతి చెందిన తామాడ లోకనాథం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ సంఘం, మానవహక్కుల వేదిక ప్రతినిధులు బీన ఢిల్లీరావు డిమాండ్ చేశారు. శనివారం లోకనాదం కుటుంబాన్ని పరామర్శించారు. ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లే కార్మికులకు సరైన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సాహుకారి జానకిరావు, తామాడ సన్యాసిరావు, పోతనపల్లి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన



కళాకారుల ప్రదర్శన

వజ్రపుకొత్తూరు రూరల్: శ్రీకాకుళంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతుల నేపథ్యంలో శనివారం సిక్కోలు జానపద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం గుండె చప్పుడు తప్పెటగుళ్ల ప్రదర్శనతో ఉద్దాన కళాకారులు అలరించారు. అనంతరం కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో తప్పెటగుళ్ల కళా గురువులు కొనారి హేమసూదన్, పాలిన శంకరరావు, కళాకారులు గణేష్, సాయి, దొరబాబు, కాశీ, బన్నీ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కంచిలి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని సిబ్బంది కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్లుగా నియమితులమయ్యామని, కొత్త ప్రభుత్వంలో ప్రైవేటీకరణ చేస్తారని ప్రచారం జరుగుతోందని, ఇలాగైతే తాము కుటుంబాలతో రోడ్డున పడతామని ఆందోళన వ్యక్తంచేశారు. మద్యం అమ్మకాలపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నా కూడా తమకు ప్రభుత్వ విభాగాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

శ్మశానవాటిక పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న రోటరీ గవర్నర్

సోంపేట: సోంపేట పట్టణంలోని కాశీవిశ్వేశ్వర ఆలయం సమీపంలో శ్మశానవాటిక మండపం తదితర అభివృద్ధి పనులకు రోటరీ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు దత్తా శనివారం శంకుస్థాపన చేశారు. రోటరీ సౌజన్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.వి.కృష్ణారావు, కోశాధికారి కె.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జానపద కళాకారుల ఆత్మీయ కలయిక

పలాస: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు జానపద కళాకారులు, వృత్తి కళాకారుల ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్లు రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా, జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. జానపద కళలపై ఇష్టాగోష్ఠి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కళాకారుడు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సామాజిక సేవలో రోటరీ క్లబ్



స్వర్గధామం వద్ద రోటరీ ప్రతినిధులు

కంచిలి: సామాజిక సేవలో రోటరీ క్లబ్ ముందుంటుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు(దత్త) అన్నారు. కంచిలి పంచాయతీ మఠం కంచిలిలోని రోటరీ నిధులతో అభివృద్ధి చేసిన స్వర్గధామాన్ని శనివారం ప్రారంభించారు. స్వర్గధామం అభివృద్ధికి స్థానిక వ్యాపారి కొత్తకోట నాగరాజు తన తండ్రి సర్వేశ్వరరావు జ్ఞాపకార్థం రూ.10లక్షలు కేటాయించగా, మరికొందరు దాతల సాయంతో గేటు, స్నానాల గది, ఇతర అభివృద్ధి పనుల్ని చేపట్టారు. అదేవిధంగా స్థానిక పీహెచ్‌సీ రోగుల సౌకర్యార్థం 10 కుర్చీలను కేటాయించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఆర్.దినేష్‌కుమార్, దాత కొత్తకోట నాగరాజు, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ ఎల్.లక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, టీడీపీ నేతలు జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య, రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, సెక్రటరీ పి.వి.కృష్ణారావు, కోశాధికారి కొద్ర రవికుమార్, రోటరీ సభ్యులు ఇప్పిలి ప్రవీణ్‌కుమార్, పూనా రజనీకాంత్, కొంచాడ సోమేశ్వరరావు, కొంచాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ



బెంచీలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం వద్ద అదే గ్రామానికి చెందిన బొడ్డు గణపతి తన తల్లిదండ్రులు గున్నయ్య, సావిత్రిల జ్ఞాపకార్థం 10 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. గ్రామస్తుల సమక్షంలో శనివారం వీటిని ప్రారంభించారు.